నమస్తే తెలంగాణ

వికారాబాద్

I | హైదరాబాద్, సోమవారం 23 సెప్టెంబర్ 2024 | VIKARABAD




ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, పక్కన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

# గ్రేటర్‌లో పలుచోట్ల వర్షం

**రాగల మరో రెండు రోజులు వర్ష సూచన.. ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం ప్రభావంతో గ్రేటర్‌లో ఆదివారం సాయంత్రం పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వాన కురిసింది. రాత్రి 9గంటల వరకు ఉప్పల్, బండ్లగూడలో అత్యధికంగా 2.15సెం.మీలు, లింగోజిగూడలో 1.78, నాగోల్‌లో 1.75 , వనస్థలిపురంలో 1.40సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. కాగా బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం రాగల 24గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశాలున్నాయి. దీంతో మరో రెండు రోజులు గ్రేటర్‌లో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32.0డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21.4డిగ్రీలు, గాలిలో తేమ 65 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

# రాడార్ కేంద్రం వద్దే..వద్దు..

**దామగుండాన్ని రక్షించుకునే బాధ్యత మనందరిపై ఉన్నది**

**పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి**

**వన్యప్రాణుల మనుగడకు ముప్పు కలుగుతుంది : వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్**

**సేవ్ దామగుండం పేరిట ఇందిరాపార్కు వద్ద ధర్నా**

**అధిక సంఖ్యలో పాల్గొని మద్దతు తెలిపిన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాసంఘాల నేతలు**

పరిగి/వికారాబాద్, సెప్టెంబర్ 22 : నేవీ రాడార్ కేంద్రం వద్దే..వద్దు అని.. దానితో పర్యావరణం నాశనం అవుతుందని.. దామగుండాన్ని రక్షించుకునే బాధ్యత మనం దరిపై ఉన్నదని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సేవ్ దామగుండం పేరిట హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాలో బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, ప్రొఫెసర్, మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్‌తో కలిసి ఆయన పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ..పూడూరు ప్రాంతంలో నేవీ రాడార్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తే అడవి నాశనమవుతుందని, పర్యావరణం దెబ్బతింటుందనే ఒకే ఒక్క కారణంతో మాజీ సీఎం కేసీఆర్ ఈ ప్రాజెక్టును పక్కన పెట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నేవీ రాడార్ సెంటర్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం ద్వారా పూడూరు ప్రాంతంలోని అటవీ సంపద, వన్యప్రాణులకు ముప్పు పొంచి ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ కేంద్రం ఏర్పాటైతే 12 లక్షల ఔషధ మొక్కలకు ప్రమాదం ఉందని, పర్యావరణానికి తీవ్ర హాని జరుగుతుందన్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో నష్టం తప్ప లాభం లేదని ఆయ న స్పష్టం చేశారు. అనంతరం వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడుతూ.. రాడార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే వికారాబాద్ అడవుల్లో సహజ వనరులను కోల్పో తామని, వన్యప్రాణుల మనుగడకు ముప్పు కలుగుతుందన్నారు. ఈ విషయాన్ని ముందుగానే గ్రహించిన మన తొలి సీఎం కేసీఆర్ 3,000 ఎకరాల భూమిని కేంద్ర ప్రభుత్వానికి అప్పగించేందుకు పదేండ్ల పాటు నిరాకరించినట్లు గుర్తు చేశారు. ఈ ధర్నాలో పరిగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సునంద, బుగ్గన్న, రవికుమార్, మహేందర్, గీత, బీఆర్ఎస్ శ్రేణులు, పర్యావరణ ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




'సేవ్ దామగుండం'కు మద్దతు తెలుపుతున్న పరిగి బీఆర్ఎస్ నాయకులు





# పల్లెపోరుకు.. సన్నద్ధం..

పల్లె పోరు కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ముందస్తుగానే ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన జాబితా ప్రకారమే పంచాయతీల పరిధుల్లో వార్డుల వారీగా లిస్ట్‌ను అధికారులు రూపొందిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని 558 గ్రామ పంచాయతీల్లోని 8,19,914 మంది ఓటర్లకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల కాగా.. దానిపై పలు దఫాలుగా రాజకీయ పార్టీల నాయకులతో అధికారులు సమావేశాలు నిర్వహించారు. అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ సైతం పూర్తైంది. ఈనెల 28న తుది జాబితాను విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే జిల్లాలోని పలు మండలాల్లో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండడం తో పంచాయతీ ఎన్నికల్లోనూ వారే నిర్ణేతలు కానున్నారు.

-రంగారెడ్డి, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ)

**వార్డుల వారీగా ఓటరు జాబితా రూపకల్పన**

**ఇప్పటికే డ్రాఫ్ట్ నోటిఫికేషన్ రిలీజ్ చేసిన ఎన్నికల అధికారులు**

**ఈ నెల 28న తుది జాబితా విడుదలకు సన్నాహాలు**

**రంగారెడ్డి జిల్లాలోని 558 పంచాయతీల్లో 8,19,914 మంది ఓటర్లు**

**9 మండలాల్లో మహిళా ఓటర్లే అధికం**


**జిల్లాలోని పంచాయతీల్లో ఓటర్ల వివరాలు మండలాల వారీగా..:**

| మండలం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| అబ్దుల్లాపూర్‌మెట్ | 22,810 | 22,859 | 4 | 45,673 |
| ఆమనగల్లు | 7,247 | 7,160 | - | 14,407 |
| చేవెళ్ల | 29,200 | 29,097 | 2 | 58,299 |
| ఫరూఖ్‌నగర్ | 24,880 | 24,996 | 3 | 49,879 |
| ఇబ్రహీంపట్నం | 15,327 | 15,504 | 2 | 30,833 |
| చౌదరిగూడెం | 12,659 | 12,386 | 4 | 25,049 |
| కడ్తాల్ | 17,212 | 16,314 | 1 | 33,527 |
| కందుకూరు | 25,577 | 25,191 | 1 | 50,769 |
| కేశంపేట | 17,848 | 18,011 | 1 | 35,860 |
| కొందుర్గు | 11,489 | 11,705 | - | 23,194 |
| కొత్తూరు | 8,162 | 8,018 | 1 | 16,181 |
| మాడ్గుల | 22,485 | 21,562 | - | 44,047 |
| మహేశ్వరం | 22,771 | 22,570 | 4 | 45,345 |
| మంచాల | 20,337 | 19,656 | 1 | 39,994 |
| మొయినాబాద్ | 30,613 | 29,880 | 2 | 60,495 |
| నందిగామ | 13,409 | 13,460 | 2 | 26,871 |
| షాబాద్ | 24,313 | 23,740 | 1 | 48,054 |
| శంషాబాద్ | 20,485 | 20,732 | 2 | 41,219 |
| శంకర్‌పల్లి | 22,232 | 22,326 | 1 | 44,559 |
| తలకొండపల్లి | 18,807 | 18,356 | 1 | 37,164 |
| యాచారం | 24,241 | 24,253 | 1 | 48,495 |
| మొత్తం | 4,12,104 | 4,07,776 | 34 | 8,19,914 |

ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై ఎన్నికల అధికారులు కసరత్తు చేసి తుది రూపునకు తీసుకొచ్చారు. వార్డుల వారీగా రూపొందించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను ఈ నెల 12న అన్ని గ్రామపంచాయతీల్లోని నోటీస్ బోర్డుల్లో పెట్టారు. మండల పరిషత్ కార్యాలయాల్లోనూ అందుబాటులో ఉంచారు. ఒక వార్డులో ఉండాల్సిన ఓటర్లు మరో వార్డులో ఉండడం, ఓటర్ల పేర్ల విషయంలోనూ తప్పులు దొర్లాయి. డబుల్ ఓట్లు, చనిపోయిన వారి ఓట్ల విషయంలోనూ చాలాచోట్ల అభ్యంతరాలున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 14 నుంచి 21 వరకు అభ్యంతరాలను స్వీకరిం చారు. ఇందుకుగాను ఆయా పంచాయతీల్లో సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అభ్యంతరాలను జిల్లా పంచాయతీ అధికారి క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాక తుది జాబితాను ఈనెల 28న విడుదల చేయనున్నారు.

### 9 మండలాల్లో మహిళా ఓటర్లే అధికం..

అధికారులు ఇటీవల విడుదల చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రకారం ఓటర్ల జాబితాను పరిశీలిస్తే..చాలా చోట్ల మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్, ఫరూఖ్‌నగర్, ఇబ్రహీంపట్నం, కేశంపేట, కొందుర్గు, నందిగామ, శంషాబాద్, శంకర్‌పల్లి, యాచారం మండలాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నా రు. దీంతో రాబోయే పంచాయతీ ఎన్నికల్లో గెలుపోటములను వారే నిర్ణయించే అవకాశం ఉన్నది.



# బయటి ఫుడ్ ప్రమాదకరం



**గడువు ముగిసిన వస్తువులతో ఆహారం తయారీ**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని వ్యాపారులపై ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం సోమాజిగూడ జల్‌పాన్ రెస్టారెంట్‌లో వంటగది అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. పుట్టగొడుగులు, నువ్వుల నూనె, పాల ప్యాకెట్ తదితర ఆహార ప్యాకెట్లు గడువు ముగిసినట్లు తనిఖీలో తేల్చారు. వంటగది కిటికీకి అమర్చిన మెష్‌లో పావురం రెట్టలు ఉండి దుర్వాసన వెదజల్లుతున్నట్లు నిర్ధారించారు. దీంతో పాటు పంజాగుట్ట మెరిడియన్ రెస్టారెంట్‌లో వంటగది ప్రాంగణం అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. బిర్యానీ తయారు చేసే ప్రాంతంలో నీరు నిలువడం, ఫ్రిజ్‌లో ఉన్న వస్తువులకు లేబుల్స్ సరిగా లేవని తేల్చి సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకున్నట్లు ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు పేర్కొన్నారు.




# ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

**కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద సండే సందడి**

మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు పర్యాటకులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో తరలివచ్చి సందడి చేశారు. బోటింగ్ చేస్తూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. చుట్టూ ఉన్న ప్రాజెక్టు అందాలను తిలకిస్తూ సెల్ఫీలు తీసుకున్నారు.

- ధారూరు, సెప్టెంబర్ 22



# భారీ వర్షం..విద్యుత్ వ్యవస్థ ఆగమాగం

**అర్ధరాత్రి వరకు పూర్తి కానీ పునరుద్ధరణ పనులు**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి విద్యుత్ వ్యవస్థ ఆగమాగమైంది. చాలా చోట్ల చెట్లు కూలిపోగా, వాటి కొమ్మలు విద్యుత్ తీగలపై పడ్డాయి. అలాగే కొన్ని చోట్ల గాలులకు భారీ హోర్డింగ్‌లపై నుంచి ఫ్లెక్సీలు ఎగిరిపోయి 33 కేవీ లైన్లు, 11 కేవీ లైన్లపై పడటంతో చాలా ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలపై చెట్లు కూలడంతో అవి విరిగిపోయాయి. బంజారాహిల్స్, సికింద్రాబాద్, హబ్సిగూడ, సరూర్‌నగర్ సర్కిళ్లతో పాటు రాజేంద్రనగర్, సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొన్ని గంటల పాటు కరెంటు లేదు. కాగా విద్యుత్ సరఫరా లేని ప్రాంతాలను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ పర్యవేక్షించారు.

### గంటలు గడిచినా రాని కరెంటు...

వర్షం నిలిచిన తరువాత నగరంలో ఓ వైపు ట్రాఫిక్, మరో వైపు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొన్నది. కొన్ని చోట్ల వర్షం ఆగిపోయి 2 గంటలు గడిచినా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదని వందలాది మంది ట్విట్టర్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గ్రేటర్‌లో విద్యుత్ నెట్‌వర్క్ చాలా చోట్ల దెబ్బతినడంతోనే పునరుద్ధరణ పనులు ఆలస్యమైనట్లు విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించారు. వర్షంలోనే కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సిబ్బంది కరెంటు స్తంభాలు ఎక్కి తీగలపై పడిన చెట్ల కొమ్మలు, ఇతర వస్తువులను తొలగించారని తెలిపారు. రాత్రంతా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేశామని అధికారులు తెలిపారు.